క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఎన్నిక


శ్రీరాములు, అధ్యక్షుడు

నడిగూడెం : మండల కేంద్రంలో ఆదివారం గ్రామీణ వైద్యుల సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘం మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎ.శ్రీరాములు, సహ అధ్యక్షుడిగా నాగభూషణం, ప్రధాన కార్యదర్శిగా సైదులు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నాగేశ్వరరావు, కార్యనిర్వాహక కార్యదర్శిగా గురుస్వామి, ఉపాధ్యక్షులుగా కనకరత్నం, వెంకట్, సహాయ కార్యదర్శులుగా నరేష్, సందీప్, అర్జున్, పలువురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ


పండ్లు పంపిణీ చేస్తున్న సైదులు

నేరేడుచర్ల : మండల కేంద్రంలోని అనాథ వృద్ధాశ్రమంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఉట్కూరి సైదులు జన్మదినం సందర్భంగా ఆదివారం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జంగిలి వెంకటేశ్వర్లు, గజ్జల కోటేశ్వర్‌రావు, నాగరాజు, ఆశ్రమ నిర్వాహకురాలు సావిత్రమ్మ తదితరులున్నారు.

బాధిత కుటుంబానికి మంత్రి జగదీష్‌రెడ్డి పరామర్శ


ఝాన్సీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి, నాయకులు

హుజూర్‌నగర్ : పట్టణానికి చెందిన న్యాయవాది వక్కవంతుల గోపినాథ్ తల్లి ఝాన్సీ సంతాప సభ ఆదివారం పట్టణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యుత్‌శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి హాజరై ఆమె చిత్రపటానికి పూలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట జెడ్పీటీసీ కె.సైదిరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, ముడెం గోపిరెడ్డి, హరిబాబు, సైదులు, రామకృష్ణ ఉన్నారు.

తెల్లబెల్లి వాసికి ఆర్డీఓగా పదోన్నతి


పదోన్నతి పొందిన దామోదర్‌రావు

నడిగూడెం : మండలంలోని తెల్లబెల్లి గ్రామానికి చెందిన కొల్లు దామోదర్‌రావు ఆర్డీఓగా పదోన్నతి పొందారు. ప్రస్తుతం ఆయన మేళ్లచెరువు తహసీల్దార్‌గా పని చేస్తున్నారు. ఆయన పదోన్నతి పొందడం పట్ల ఆ గ్రామ సర్పంచ్ దేవబత్తిని వెంకటనర్సయ్య, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

పేదలకు అల్పాహారం అందజేత


అల్పాహారం అందజేస్తున్న క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : పట్టణంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ కట్టమనేని బాబురావు జన్మదినం సందర్భంగా ఆదివారం పేదలకు అల్పాహారం అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. నిరుపేదలకు, విద్యార్థులకు సహాయ సహకారం అందించడంలో లయన్స్‌క్లబ్ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి జిలకర రామస్వామి, కోశాధికారి లింగబోయిన రామకృష్ణ, డిస్ట్రిక్ కమిటీ సభ్యులు బట్టు మధు, సభ్యులు కొణతం సీతారాంరెడ్డి, క్రాంతికుమార్, సూరిబాబు, లక్ష్మారెడ్డి, విశ్వనాథం పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లోని సమస్యలను పరిష్కరించాలి

హుజూర్‌నగర్ : విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, పాఠశాలల్లోకి విద్యార్థి సంఘాల నాయకులకు, మీడియాకు అనుమతి లేదని విద్యాశాఖ అధికారి దేవసేన పేర్కొనడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చందర్‌రావు అన్నారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేస్తున్న అవినీతి, అక్రమాలు బయటపడతాయనే ఆలోచనతో ఇలాంటి నిర్ణయాలు తీసుకున్నారని అన్నారు. దేవసేన పార్టీ కార్యకర్తలాగా మాట్లాడటం దుర్మార్గమన్నారు. పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలుగా కావస్తున్నా నేటికీ పాఠ్య పుస్తకాలు, యూనిఫాంను అందించడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. దేవసేన మాట్లాడిన మాటలను ఆమె వెంటనే వెనక్కు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శ్రీకాంత్, నాగు, చినబాబు, నాగరాజు, చందూలాల్, శివకుమార్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక సాగు వైపు మొగ్గు


డ్రమ్‌సీడర్ పద్ధతిలో విత్తనాలు విత్తుతున్న రైతు


సిరిపురంలో విత్తనాలను వెదజల్లుతున్న రైతు

- సంప్రదాయ పద్ధతులకు స్వస్తి
- డ్రమ్‌సీడర్, వెదజల్లే సాగుపై అన్నదాతల ఆసక్తి
- రైతుల్లో పెరుగుతున్న అవగాహన

నడిగూడెం : రాష్ట్రంలో సాగు నీటికి నోచుకోక వ్యవసాయాన్ని వదిలేసిన రైతులు, సాగు నీటి లభ్యత పెరగడంతో ఎక్కువ శాతం వరిసాగుపై దృష్టి సారించారు. ఈ సాగులో కూలీల కొరత రైతులను వేధిస్తోంది. దీంతో నారుమండి అవసరం లేకుండా పంటకాలాన్ని తగ్గించడానికి వెదజల్లే పద్ధతిలో, డ్రమ్‌సీడర్ పద్ధతిలో వరి సాగుపై రైతులు దృష్టి సారిస్తున్నారు. నారు పోయడం, నీరు పెట్టడం, నాట్లు వేయించడం ఇవన్నీ పాతతరం వరిసాగు పద్ధతి. రైతులు ఆధునిక వ్యవసాయం వైపు ఆసక్తి చూపుతున్నారు. వరి సాగులో కూలీలు, యంత్రాల కొరత అధిగమించడానికి, పెట్టుబడి తగ్గించుకోవడానికి అధిక దిగుబడి సాధించేందుకు సాంకేతిక పద్ధతులు వినియోగిస్తూ పంటలు సాగు చేస్తున్నారు. రోజు రోజుకూ సాగుపై చేసే ఖర్చు పెరగడం, మరో వైపు కూలీల కొరత సమస్యలను అధిగమించేందుకు రైతులు డ్రమ్‌సీడర్ పద్ధతిని వినియోగిస్తున్నారు. ఈ పద్ధతితో రైతులకు తక్కువ ఖర్చు అవుతుంది. దీంతో ఈ విధానంపై ఆసక్తి చూపుతున్నారు. మండలంలో ప్రస్తుత వానాకాలం దాదాపు 15వేల ఎకరాలలో వరిసాగు చేస్తున్నారు. ఇందులో దాదాపు 30శాతం డ్రమ్‌సీడర్, 30శాతం వెదజల్లే పద్ధతిలో పంట సాగు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. డ్రమ్‌సీడర్‌ను రూ.4 నుంచి రూ.5వేల వరకు వెచ్చించి రైతులు కొనుగోలు చేస్తున్నారు. డ్రమ్‌సీడర్‌తో విత్తనాలు వెదజల్లడంతో నిర్దిష్టమైన అంతరంలో సాళ్లు వస్తాయి. డ్రమ్‌సీడర్ విధానంతో 20రోజుల ముందే పంట చేతికి వస్తుంది. 3నుంచి 4బస్తాల దిగుబడి అదనంగా వస్తుంది. వినూత్న పద్ధతిలో చేపడుతున్న సాగు విధానాలపై రైతులు మొగ్గు చూపుతున్నారు.

అధిక దిగుబడులు వస్తున్నాయి



గతంలో వరిపంట సాగు చేయాలంటే కూలీల కొరతతో రైతులకు ఇబ్బందులు ఉండేవి. పెట్టుబడులు కూడా అధికంగా పెరుగుతున్నాయి. దీంతో 15సంవత్సరాలుగా 16ఎకరాల కౌలు వ్యవసాయ భూమిలో వెదజల్లే పద్ధతిని పాటిస్తున్నాము. పెట్టుబడులు తగ్గడంతో పాటు, దిగుబడులు కూడా పెరుగుతున్నాయి.

– తాళ్లూరి వెంకటేశ్వర్లు, రైతు, సిరిపురం

ఈ పద్ధతులతో సాగు సులువు



డ్రమ్‌సీడర్, వెదజల్లే పద్ధతులు రైతులకు చాలా సులువు. ఈ పద్ధతులతో కూలీల సమస్య, ఖర్చు తగ్గుతుంది. అన్నదాతలకు ఈ విధానాలపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం. ఎకరానికి దాదాపు రూ.10వేల వరకు ఖర్చు తగ్గుతుంది. దిగుబడి కూడా ఆశాజనకంగా వస్తుంది. ప్రతి రైతు ఈ పద్ధతులలో సాగు చేపట్టాలి. ఈ సీజన్‌లో ఈ పద్ధతులలో సాగు పెరుగుతుంది.

– ఎం.రాజగోపాలరావు, వ్యవసాయాధికారి, నడిగూడెం

సంప్రదాయ పండుగలకు నిలయం తెలంగాణ

- ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్


కోదాడరూరల్ : మంగళితండాలో తీజ్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్

కోదాడరూరల్ : సంస్కృతి, సంప్రదాయ పండుగలకు తెలంగాణ రాష్ట్రం నిలయమని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మంగళితండాలో నిర్వహించిన తీజ్ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి అభివృద్ధికి బాటలు వేశారని తెలిపారు. సీత్లాభవానీ అమ్మవారి ఆశీస్సులతో పాడిపంటలు సుభిక్షంగా ఉండాలని మొక్కుకున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం స్థానికులతో కలిసి అమ్మవారికి గోధుమ గడ్డిని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. స్థానిక మహిళలతో ఆయన కలిసి నృత్యాలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రమావత్ పద్మా జబ్బార్, ఉపసర్పంచ్ వాసు, సావిత్రి, నాగ, లచ్చు, సింహాద్రి ఉన్నారు.

బాధితుడికి పరామర్శ..

పట్టణ పరిధిలోని తమ్మరకు చెందిన సామినేని వెంకటేశ్వరరావు అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయనతో పాటు నెల్లూరి నరసింహారావు, వహీద్‌ను కూడా పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ


కోదాడ : బాధితుడికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

కోదాడ : ఆపదలో ఉన్న పేదవారికి సీఎం రిలీఫ్ ఫండ్ వరంలాంటిదని, బాధితులు దానిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ కోరారు. ఆదివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో చిలుకూరు మండల కేంద్రానికి చెందిన నాగిరెడ్డి అంకిరెడ్డికి మంజూరైన రూ.2లక్షల చెక్కు, కోదాడకు చెందిన అర్వపల్లి అశోక్‌కు మంజూరైన రూ.లక్షా 50వేల చెక్కులను బాధితులకు ఆయన అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అల్సాగాని జనార్దన్, వెంపటి మధు, చిలుకూరు పీఏసీఎస్ చైర్మన్ అలసకాని జనార్దన్, కొల్లు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలి


గరిడేపల్లిలో రాస్తారోకో చేస్తున్న సీపీఐ, సీపీఎం నాయకులు


కోదాడఅర్బన్ : మణిపూర్ మృతుల ఆత్మశాంతికి బాప్టిస్ట్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

గరిడేపల్లి : మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న మారణహోమం ఆగాలంటే తక్షణమే మణిపూర్ బీజేపీ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని సీపీఐ, సీపీఎం మండల కార్యదర్శులు షేక్ యాకుబ్, పోకల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో కోదాడ–జడ్చర్ల ప్రధాన రహదారిపై సీపీఎం, సీపీఐల ఆధ్వర్యంలో ఆదివారం రాస్తారోకో నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 76ఏళ్లు అవుతున్నప్పటికీ నేటికి మహిళలను నగ్నంగా ఊరేగించడంతో పాటు సామూహిక అత్యాచారం చేయడంతో పాటు హత్య చేసిన దుండుగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు యడ్ల అంజిరెడ్డి,అంజయ్య, ముత్తయ్య, వెంకటేశ్వర్లు, గోపి, నవీన్, సైదులు, వెంకటయ్య, చారీ, తిరుపతయ్య తదితరులున్నారు.

బాప్టిస్ట్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

కోదాడఅర్బన్ : పట్టణంలోని నయానగర్ బాప్టిస్ట్ చర్చిలో పాస్టర్ యేసయ్య ఆధ్వర్యంలో మణిపూర్‌లో అత్యాచార, హత్యకు గురైన క్రిస్టియన్ మహిళల ఆత్మకు శాంతి చేకూరాలని ఆదివారం క్రిస్టియన్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో క్రిస్టియన్ కోఆప్షన్ సభ్యులు వంటిపాక జానకియేసయ్య, జాన్, జగ్గునాయక్, విజయచంద్, మోసిన్, కల్యాణ్, రాంబాబు, మేరమ్మ, సీత, జ్యోతి, రాణి, శారా, గురునాథ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్యే నిర్లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న శివకుమార్


నేరేడుచర్ల : నియోజకవర్గంలోని పేద ప్రజల సమస్యలను పరిష్కరించకుండా ఎమ్మెల్యే నిర్లక్ష్యం వహిస్తున్నారని, పేదలు ఇళ్ల స్థలాల కోసం పోరాటాలు చేస్తుంటే పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని ప్రజాపంథా పార్టీ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లు, దళితులకు మూడేకరాల భూమి, రుణమాఫీ, దళిత బంధు, బీసీ బంధు వంటి హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలో లింకు రోడ్లు గుంతలమయంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే పట్టించుకోవడం లేదన్నారు. నియోజకవర్గంలోని ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పార్టీ ఆధ్వర్యంలో ఆగస్టు 1వ తేదీన నిర్వహించే ర్యాలీ, హుజూర్‌నగర్ నియోజకవర్గ స్థాయి సదస్సును విజయవంతం కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు వాస పల్లయ్య, హుస్సేన్, కరుణాకర్, పావని, సత్తమ్మ తదితరులున్నారు.

పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలి


కుతుబ్‌షాపురంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

గరిడేపల్లి : అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని కుతుబ్‌షాపురం గ్రామంలో శిథిలావస్థకు చేరిన ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను వారు పరిశీలించి మాట్లాడారు. అర్హులైన పేదలకు ఇళ్లు ఇస్తామని చెప్పి మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ఒక్క ఇంటి నిర్మాణానికి రూ.2లక్షల 80వేలు ఖర్చు చేసి ఇళ్లను నిర్మించి వదిలేయడంతో అవి శిథిలావస్థకు చేరాయని వాపోయారు. ఇళ్లను పరిశీలించిన వారిలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొణతం లచ్చిరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ వేముల శేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు నర్సింగ్ అంజయ్య, ఓబీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మేకల వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు రామరాజు, నాయకులు రామినేని కృష్ణయ్య, చంద్రారెడ్డి, సోమయ్య, రాంకి, శోభన్‌బాబు, మంద వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

గ్రామాల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి


రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

మఠంపల్లి : గ్రామాల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీటీసీ లక్ష్మీభరత్ నాయక్, సర్పంచ్ పాండునాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని కొత్తతండా నుంచి హనుమంతులగూడెం వరకు పంచాయతీరాజ్ నిధులతో చేపట్టనున్న బీటీరోడ్డు, అదేవిధంగా సీసీరోడ్డు పనులను వారు ప్రారంభించి మాట్లాడారు. పంచాయతీరాజ్ శాఖ నుంచి సుమారు రూ.2కోట్లతో ఎమ్మెల్యే సైదిరెడ్డి సహకారంతో ఈరోడ్డు స్థానిక కొత్తండా మీదుగా పాతదొనబండతండా, జామ్లాతండా, భీల్యానాయక్‌తండా, కామంచికుంటతండా, యాతవాకిల్ల, హనుమంతులగూడెం వరకు సుమారు 8కిలోమీటర్లు బీటీరోడ్డు నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ లాస్యానాయక్, మాజీ ఎంపీటీసీ వీణానాయక్, మాజీ ఏఎంసీ డైరెక్టర్ నాగేశ్వరరావు, రాజేష్, శ్రీను, కాంతారావు, బాబు, భీముడు, నరేష్, ఎలమందా, లచ్చిరాం, రమేష్, నాగచైతన్య, పీకా, సైదా, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య సిబ్బంది సర్వే


సర్వే చేస్తున్న వైద్యసిబ్బంది

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలంలోని మల్లారెడ్డిగూడెం, నక్కగూడెం, తదితర గ్రామాల్లో వైద్యసిబ్బంది సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా కళ్ల కలక, జర్వం తదితర సీజనల్ వ్యాధులపై గ్రామస్తుల నుంచి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి వేణు, సీహెచ్‌ఓ కృష్ణయ్య, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, సూపర్‌వైజర్ రాజ్‌కుమార్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి శంకుస్థాపన

మఠంపల్లి : మండలంలోని యాతవాకిల్లలో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం నూతన భవన నిర్మాణానికి ఆదివారం సర్పంచ్ కోలాహలం లక్ష్మీనరసింహరాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణంతో యాతవాకిల్లతో పాటు పరిధిలోని చుట్టు గ్రామాలకు చెందిన ప్రజలకు వైద్యసేవలు మరింత అందుబాటులోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోలాహలం కృష్ణంరాజు, ఉపసర్పంచ్ శాంతినరసింహారెడ్డి, ఏఈ జితేందర్‌రెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు ఎల్లావుల నాగయ్యయాదవ్, మండల రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్ మచ్చ వెంకటేశ్వర్లు, వెంకన్న, శ్రీను, ప్రకాష్, లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్మికులను క్రమబద్ధీకరించాలి


నడిగూడెంలో మాట్లాడుతున్న కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్


మఠంపల్లిలో మాట్లాడుతున్న పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ


హుజూర్‌నగర్‌రూరల్ : మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు నవీన్

నడిగూడెం : గ్రామపంచాయతీ కార్మికులను క్రమబద్ధీకరించాలని పంచాయతీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ధనియాకుల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మెకు ఆదివారం వారు మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో 12,769 గ్రామ పంచాయతీల్లో 50వేల మంది కార్మికుల పనిచేస్తున్నారని, వారు 25రోజులుగా శాంతియుతంగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాంబాబు, నాయకులు చిమట నాగరాజు, పరుశరాములు, తిరపయ్య, లక్ష్మీనారాయణ, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

గరిడేపల్లి : తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారం కూడా కొనసాగింది. ఈ సమ్మెకు సీపీఐ, సీఐటీయూ నాయకులు సంఘీభావం తెలిపారు. అనంతరం సీఐటీయూ జిల్లా నాయకులు యాకుబ్, సీపీఐ మండల పార్టీ కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు మాట్లాడారు. గ్రామ పంచాయతీ కార్మికులు న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో పాలక ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. కార్మికులకు అండగా కమ్యూనిస్ట్ పార్టీ పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో గోపగాని సత్యనారాయణ, నర్సిరెడ్డి, శ్రీను, వెంకన్న, ముత్తయ్య, నవీన్, చారి, గోపయ్య, అంజయ్య తదితరులున్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె

మఠంపల్లి : నామమాత్రపు వేతనాలతో పనిచేస్తున్న పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె కొనసాగుతుందని సీఐటీయూ అనుబంధ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రాధాకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కార్మికులు చేస్తున్న సమ్మె ఆదివారం 25వ రోజు కొనసాగింది. ఈ సమ్మెలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఏళ్ల తరబడి పంచాయతీ కార్మికులతో వెట్టిచాకిరీ చేయిస్తూ సమస్యలను పరిష్కరించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు, రెగ్యులరైజ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు, మండల కన్వీనర్ సయ్యద్ రన్‌మియా, పంచాయతీ కార్మికుల యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఇంటి రవి, ఎం.మైసయ్య, మోతీలాల్, పిచ్చయ్య, నరసింహారెడ్డి, దేవదానం, వెంకటేశ్వర్లు, వెంకటయ్య, నాగలక్ష్మి, వీరస్వామి, సైదానాయక్ పాల్గొన్నారు.

కార్మికుల సమ్మెపై ప్రభుత్వం పట్టువీడాలి

హుజూర్‌నగర్‌రూరల్ : గ్రామపంచాయతీ కార్మికుల నిరవధిక సమ్మెపై ప్రభుత్వం పట్టు వీడాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కామళ్ల నవీన్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరవధిక సమ్మె చేస్తున్న జీపీ కార్మికులనుద్దేశించి ఆయన మాట్లాడారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్మూలన, స్వచ్ఛత కోసం అహర్నిశలు శ్రమిస్తున్న కార్మికుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. గ్రామ పంచాయతీల్లో బడుగు, బలహీల వర్గాలకు చెందిన నిరుపేదలు ఎక్కువగా పని చేస్తున్నారని వారి కష్టానికి తగిన విధంగా వారికి వేతనాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వెంటనే వేతనాలు పెంచి జీఓ నంబర్ 51ని రద్దు చేసి పాత విధానాన్ని కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను, వల్లపుదాసు రాజు, పంచాయతీ కార్మికులు సంఘం మండల అధ్యక్షుడు షేక్ హుసన్‌మియా, ఉపాధ్యక్షుడు కొండల్, యల్లమ్మ, రత్నం, ప్రసాద్, అంజయ్య, వీరారెడ్డి, మైసయ్య, సైదులు, నాగరాజు, కాశమ్మ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వైఖానసలు.. సామాజిక, రాజకీయ రంగాల్లో ఎదగాలి


సమావేశంలో పాల్గొన్న వైఖానసలు

హుజూర్‌నగర్ : వైఖానసలు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో ఎదగాలని ఆ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎన్.రాఘవాచారి అన్నారు. ఆదివారం పట్టణంలో జిల్లా వైఖానసల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైఖానసలు అన్ని రంగాలలో ఎదగడమే కాకుండా ఇతరులకు సహాయ సహకారాలు అందించాలన్నారు. వైఖానస సేవలను ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలని కోరారు. అనంతరం జిల్లా, నియోజకవర్గ, మండల వైఖానస కమిటీలను ఎన్నుకున్నారు. సదస్సు ఏర్పాటు చేసిన ఎస్.రంగభట్రాచార్యులను అభినందించారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు వి.మోహన్‌కృష్ణ, బొర్రా వాసుదేవాచార్యులు, భాస్కరాచార్యులు, డీవీ లక్ష్మణాచార్యులు, అప్పలాచార్యులు, మురళీ కృష్ణమాచార్యులు, రాజన్, నర్సింహాచార్యులు, తిరునగరి శ్రీనివాసచార్యులు, రామకృష్ణమాచార్యులు, గాయత్రీప్రసాద్, తరుణ్‌దేవి, శ్రీనివాసచార్యులు, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్యశిబిరం

కోదాడఅర్బన్ : పట్టణంలోని పెన్షనర్స్ భవన్‌లో విశ్రాంత ఉద్యోగుల సంఘం కోదాడ యూనిట్ వారి ఆధ్వర్యంలో శరత్ మాక్సివిజన్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి హన్మకొండ వారు ఆగస్టు 1వ తేదీన (మంగళవారం) ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు కోదాడ విశ్రాంత ఉద్యోగుల సంఘం కోదాడ యూనిట్ అధ్యక్షుడు వేనేపల్లి శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ వైద్య శిబిరంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, విశ్రాంత ఉద్యోగులకు, పోలీస్‌శాఖ, జర్నలిస్టులకు, హెల్త్ ఇన్సూరెన్స్ ఉన్నవారికి కుటుంబ సభ్యులకు నగదు రహిత ఆపరేషన్లు చేయడంతో పాటు ఆరోగ్యశ్రీ, ఆహార భద్రత కార్డు కలిగి ఉన్న వారికి ఉచితంగా పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి నెలా మొదటి మంగళవారంలో ఈ ఉచిత వైద్యశిబిరం ఉంటుందన్నారు.

హుజూర్‌నగర్ : పట్టణంలోని ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో ఆగస్టు 1న (మంగళవారం) ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ సోమయ్య, కె.వీరారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, రిటైర్డ్ ఉద్యోగులు, వారిపై ఆధారపడిన వారు, ఈహెచ్ఎస్ హెల్త్‌కార్డు ఉన్న వారికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తారని తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మోతె : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కరక్కాయలగూడెం సర్పంచ్ నూకల యుగంధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కరక్కాయలగూడెం గ్రామంలో సర్పంచ్ పలు వార్డులను సందర్శించి డ్రై డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం పద్మ, ఆరోగ్య సిబ్బంది, సైదులు, ఆశవర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల వేడుకలు


బోనాలతో వెళ్తున్న మహిళలు

చిలుకూరు : మండల కేంద్రం పాత చిలుకూరులో ఆదివారం గౌడ ముత్యాలమ్మ తల్లి బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బొడ్రాయి, ముత్యాలమ్మ ఆలయాల వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి బోనాలు సమర్పించారు. అనంతరం మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆలయ భూముల కౌలు చెల్లించాలి

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయ వ్యవసాయ భూముల కౌలును రైతులు ఆగస్టు 2వ తేదీ వరకు చెల్లించాలని ఆలయ ఈఓ ఎంపీ లక్ష్మణారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు కౌలు చెల్లించని పక్షంలో అట్టి భూములకు ఆగస్టు 4న నూతనంగా కౌలు వేలం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

గ్రామపంచాయతీకి ఫ్రీజర్ బహూకరణ

నేరేడుచర్ల : మండలంలోని కల్లూరు గ్రామపంచాయతీకి రూ.60వేల విలువైన ఫ్రీజర్‌ను గ్రామానికి చెందిన దాత కొంజేటి సత్యనారాయణ అతడి తల్లిదండ్రుల జ్ఞాపకార్థంగా బహూకరించారు. ఆదివారం గ్రామసర్పంచ్ పల్లెపంగ నాగరాజుకు ఫ్రీజర్ అందజేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి పద్మ, మాజీ వైస్ ఎంపీపీ చలసాని మాధవరావు, కరుణాకర్‌రావు, మట్టయ్య, అక్కయ్యబాబు, ఎల్లయ్య, హుస్సేన్ తదితరులు ఉన్నారు.

ఇరువర్గాల దాడులు.. ముగ్గురికి గాయాలు

మేళ్లచెరువు : వ్యవసాయ భూమికి వెళ్లే దారి విషయంలో మండల కేంద్రంలో ఇరువర్గాల వారు ఆదివారం దాడులు చేసుకున్నారు. ఈ దాడుల్లో ఇరువర్గాలకు చెందిన ముగ్గురికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయంపై ఎస్ఐ సురేష్‌యాదవ్‌ను వివరణ కోరగా.. పొలాలకు వెళ్లే దారి విషయంలో గొడవ జరిగిందని గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. ఫిర్యాదు రాగానే వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

నడిగూడెం : ప్రతిఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు దేవబత్తిని వెంకటనర్సయ్య, నడిగూడెం సర్పంచ్ గడ్డం నాగలక్ష్మి కోరారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా ఆదివారం నడిగూడెం, తెల్లబెల్లి గ్రామాల్లో ఇంటింటికి మొక్కలు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడారు. పర్యావరణాన్ని పరిరక్షించాలంటే మొక్కలను సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక ఉపసర్పంచ్ నసీమా, నడిగూడెం పంచాయతీ కార్యదర్శి రాము, ఫీల్డ్ అసిస్టెంట్ పద్మ, బీఆర్ఎస్ నాయకులు కాసాని వెంకన్న, ఎస్‌కె.జలీల్, భోనగిరి ఉపేందర్, మేకల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బంది వేధిస్తున్నారని ఆరోపణ

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం గ్రామానికి చెందిన గిరిజన రైతు సక్రును విద్యుత్ సిబ్బంది విద్యుత్ బిల్లు చెల్లించాలని వేధింపులకు గురిచేస్తున్నారని ఆదివారం ఆరోపించారు. గత సెప్టెంబర్ నుంచి ఉన్న బిల్లు రూ.15,186లు కట్టాలని లేదంటే కనెక్షన్ తొలగిస్తామని మామూళ్ల కోసం డిమాండ్ చేస్తున్నారని ఆయన వాపోయారు. ఈ విషయమై విద్యుత్ ఏఈ వెంకటేశ్వరరెడ్డిని వివరణ కోరగా.. అతడి పేరుతో విద్యుత్ బిల్లు బకాయి ఉందని, విద్యుత్ వాడుకున్న వారు బిల్లు కట్టాల్సిందేనని అన్నారు. సిబ్బంది వేధిస్తున్న విషయం తనకు తెలియదని ఆయన తెలిపారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

మునగాల : మండలంలో నూతనంగా పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందిన రైతులు రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి బి.అనిల్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు బీమా దరఖాస్తు చేసుకునే రైతులు తమ దరఖాస్తుతో పాటు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు, నామిని ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులను స్థానిక రైతు వేదికలో అందజేయాలని సూచించారు.